ప్రబోధ 25

కర్మలందు జన్మకలుగుచునుండు
కర్మలందు సుఖము కలుగుచుండు
కర్మ మేలు కొడు కలగె ప్రపంచంబు
సుఖము దుఃఖము యిలను సుస్థిరములు.

కర్మాను బంధిని మనుష్యలోకే. జగత్తు బ్రహ్మమయము. బ్రహ్మమయమైన జగత్తు కర్మమయము. సృష్టియే ఒక పెద్ద కర్మ. మానవుడు సృష్టితో కూడినవాడు కనుక మానవుడే కర్మ. మానవుడనగా జీవశక్తి. జీవశక్తి యొక్క ఉపాధియే శరీరము శరీరమే కర్మమయము. కర్మానుసారముగనే దేహములు ప్రాప్తించుచున్నవి. కనుక మానవత్వమునకు, సమస్త సృష్టికిని కర్మయే ఆధారము. కర్మయే మూలము. ఈ కర్మయొక్క తత్వాన్ని గుర్తించుకొనుటకై కర్మలాచరించాలి. కర్మలాచరించుటకు మనము కర్మలను అర్థము చేసుకోవాలి.

మనోవాక్కాయములు చేసే పనులకే కర్మ అని పేరు. కర్మాచరణకు ఐదు సూత్రములు. మొదటిది శరీరము. రెండవది కర్త. మూడవది వివిధ అంగములు నాల్గవది వేరు వేరు పనులు. ఐదవదే అన్నింటిలోనూ వుండిన ప్రాణతత్వమైన దైవత్వము. దివ్యత్వము చేతనే సమస్తము కూడను జరుగుచున్నది. కాని యిట్టి దివ్యత్వమును గుర్తించుకొనలేక కేవలము అంగములను, ఉపాంగములను ఆధారము చేసుకొని మానవత్వము యొక్క కర్తవ్యాన్ని నిర్వర్తించుకొనక తాము తమ యొక్క కర్మఫలాన్ని ఆశించి కర్మలను సలుపుతున్నారు. ప్రతిఫలాపేక్షచే కర్మలాచరించుచున్నారు మానవులు. ఈ కర్మఫలమును అనుభవించుటకై మానవుడు తిరిగి జన్మనెత్తుచున్నాడు. కారణమేమనగా కర్మఫల నిమిత్తమై తాను కర్మలాచరించటము చేత కర్మఫలము అనుభవించటానికి తిరిగి మానవత్వము అనుభవించవలసి వస్తుంది. కనుకనే ఫలాపేక్షలేని కర్మలు ఆచరించటమే ప్రధాన కర్తవ్యమని గుర్తించాలి. ఇందులో రెండు విధమూలైన కర్మలు వుంటున్నవి. వీనినే ధర్మములని బోధిస్తూ వచ్చింది భగవద్గీత స్వధర్మ, పరధర్మ అని. ఈ స్వధర్మ మనగా కేవలము జాతిమతకుల వర్ణములకు సంబంధించినదిగా భావిస్తున్నారు. ఈ స్వధర్మమే శ్రేయస్సని కూడ విశ్వసిస్తున్నారు. కాని యిది శ్రేయస్సే అయినప్పటికి తాము

తలంచినట్లుగా యిది జాతి మత కులమునకు సంబంధించినది కాదు. స్వ అనగా ఆత్మ. ఆత్మకు సంబంధించిన ధర్మమే స్వధర్మము. ఇది మారునది కాని, యింకే విధమైన రూపములు ధరించునది కాని కాదు. ఇది నిర్గుణ నిరంజనముల చే కూడినది. ఇది నిత్యసత్యమైనది. ఎట్టి మార్పులు కూర్పులు కలగనిది. ఇది ఆత్మకు సంబంధించినది. కనుకనే ఆత్మసంబంధించిన ధర్మమునే మానవులు ఆచరించాలని, యిదియే శ్రేయస్సని కూడను గుర్తించాలి. పరధర్మమనగా యిది కేవలము దేహమునకు సంబంధించినది. ఇది రాగద్వేషములతో కూడినది. అహంకార మమకారములతో కూడినది. కనుకనే యిది చాలా ప్రమాదమైనది. కనుక స్వధర్మమనేది శ్రేయస్సని, పరధర్మము ప్రమాదకరమైనదిగా పోల్చుకుంటూ వచ్చింది భగవద్గీత. అనగా దేహధర్మము ఏనాటికైనా యీ ఫల ప్రాప్తిని అనుభవించే నిమిత్తమై తిరిగి యీ దేహము ధరించవలసి వస్తుంది. దేహముతో ఆచరించు సర్వ కర్మలు కూడను ఫల ప్రాప్తి నిమిత్తమై ఆచరిస్తున్నారు. కనుక యిది ప్రమాదమైనదిగా కూడను మనము విశ్వసించాలి. కర్మలు ఆచరించు సమయములందు మనకు యే మాత్రము అర్థము కాదు. ఏమందు రాబోయే విచారములకు మనము యే మాత్రము గుర్తించుకోలేక పోతున్నాము. బోనులో వుండిన పుల్లిపాయ వాసనకై పురుకు పెత్తే ఎలుకల వలె ముందు యేమి జరుగునో, యే మప్పుఖుండో, యేమి వున్నదో అనే విషయాన్ని మనము విస్మరిస్తున్నాము.

తాత్కాలిక విషయ సంపదల నిమిత్తమై మనము ఆచరించు కర్మలన్నియు కూడను మున్ముందు అవి ఒక బంధహేతువుగా వుంటున్నవి. కాని ప్రస్తుత జన్మను సార్థకము చేసుకొనే నిమిత్తమై మనము సత్కర్మలను ఆచరించటానికి ప్రయత్నించాలి. ఇందులో కూడను మూడు రకములైన కర్మలు వుంటున్నవి. ఈ మూడు కూడను గుణములతో కూడినవి. సాత్విక కర్మ, రాజసిక కర్మ, తామసిక కర్మ అని. అహంకార, మమకారములకు సంబంధములేక ఫలమును ఆశించక సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థమై ఆచరించే కర్మలు సత్కర్మలు. ఇవి కేవలము దైవాన్ని తృప్తిపరచే నిమిత్తము, దైవాన్ని ప్రసన్నుని గావించుకొనే నిమిత్తము, దైవప్రీతిని అనుభవింపగోరి యివి ఆచరించే సద్గుణములతో కూడిన కర్మలు. అహంకార మమకారములతో, ఫలాపేక్షతో చేయు కర్మలన్నియు కూడను రాజసిక కర్మలు. ఇవి కేవలము సామాన్యమైన మానవులు యీ జగత్తునందు నిత్యము ఆచరించు యొక్క గుర్తులు. పృథ్విపై కలిగిన ప్రతి మానవుడు కూడను యీ రాజసిక సంబంధమైన కర్మలనే అధికముగా అనుభవిస్తున్నాడు. వీటిని సాత్వికముగా మార్చుకొనుటకు ప్రయత్నించాలి. మూడవది తామసిక కర్మ. ఇది కేవలము స్వార్థము, స్వప్రయోజన నిమిత్తమై పరులను హింసించటము, పరులను బాధించటము, పరపీడన చేయటము యిలాంటి కృత్యములతో కూడినది. ప్రాణహింసతో

కూడినది. భూత దయా రహితమైనది. ఇది సంకుచితమైన భావములతో కూడినది. పూర్తి స్వార్థమైనది. ఈ తామసికము చాలా ప్రమాదకరమైనది.

కనుకనే మానవుడు తెలిసో తెలియకో నిత్యజీవితములో అనేక కర్మలు ఆచరిస్తూవుంటాడు. ఈ కర్మల యొక్క పరిహారనిమిత్తమై ఐదు విధములైన యజ్ఞములు నియమించారు. ఒకటి దేవ యజ్ఞము. రెండవది పితృయజ్ఞము. మూడవది భూత యజ్ఞమం. నాల్గవది మనుష్య యజ్ఞము. ఐదవది ఋషి యజ్ఞము. దీనినే బ్రహ్మ యజ్ఞమని కూడను భావిస్తూవుంటారు. ఈ యజ్ఞముల యొక్క అంతరార్థములను మనము గుర్తించటానికి ప్రయత్నించాలి.

మానవుడు నిత్యజీవితములో తాను ఆచరించే కర్మలయందు అనేక ప్రాణులు మరణిస్తున్నవి. మనకు తెలియకుండగనే రుబ్బటలో, దంచుటలో, నూరుటలో అనేక ప్రాణుల ప్రాణములు పోవుచున్నవి. ఇవి మనము తెలిసి చేసే పాపము లు కాదు. మనకు తెలియకుండానే యెన్నియో జీవులు నశించుచున్నవి. కనుక యిట్టి పాపముల యొక్క పరిహార నిమిత్తమై దేవ యజ్ఞమని నిర్ణయించారు. ఇంతేకాక మన దేహమునందు అంగ అంగమునందు రసస్వరూపులై దేవతలు నివసించుచున్నారు. అందువలననే అంగీరసులు అని వీరికి పేరు. కనుక రసస్వరూపులై మన అంగములను పోషించుచూ రక్షించుచూవుండటం చేతనే వారికి కృతజ్ఞతా పూర్వకముగా వారిని స్మరించటము, చింతించటము, ధ్యానించటము, స్వాధ్యాయనము సల్పటము యిలాంటి కార్యములందు మన నిజమైన కర్తవ్యము. నిద్రావస్థలయందు, సుషుప్తి అవస్థల యందు, మనకు తెలియని సమయములందు యీ దేహమును ఆ దేవతలే రక్షిస్తూవుంటారు. ఈ పవిత్రమైన దేహము కర్మాచరణ నిమిత్తమై కలిగినదనే సత్యాన్ని గుర్తించే వ్యక్తులు యీ కాయమును పోషించే దేవతలకు కృతజ్ఞత తెల్పటము వారి కర్తవ్యము. శరీర మాద్యం ఖలు ధర్మసాధనం అని. ఈ యొక్క కర్మసాధనకు యీ శరీరమే మూలాధారము. కనుకనే యీ అంగదేవతలైన వీరికి మనము కృతజ్ఞతా పూర్వకముగా స్మరిస్తూ, భజిస్తూ, ధ్యానిస్తూ, చింతిస్తూ వారికి కృతజ్ఞత తెలుపు కోటమే దేవయజ్ఞమని పిలుస్తూవచ్చారు. దానితోపాటు మనము తెలియక చేసిన పాపములను, తెలియక జీవులను హింసించిన పాపములను కొంతవరకు పరిహారనిమిత్తమై యీ యొక్క యజ్ఞమును చేయవలెనని చాలా విశ్వసించాలి.

ఇంక పితృ యజ్ఞము. ఈ పితృ యజ్ఞము యొక్క అంతరార్థమును కూడా మనము విచారించాలి. కట్టెలు కొట్టునప్పుడు, కొమ్మలు విరుచునపుడు, పువ్వులు కోయునప్పుడు యెన్నో ప్రాణులు మరణించుచున్నవి. కనుక యీ కర్మలు ఆచ

రించే సమయములో యీ ప్రాణులు మరణించటము చేత యీ మరణమునకు కారణము తానే అని గుర్తించుకొని యీ పాప పరిహారార్థమై పితృయజ్ఞము గావించాలనే మార్గమును అవలంబిస్తూ రావాలి. ఇంతే కాక యీ దేహమునకు మూలకారకులు తల్లితండ్రులు. మన రక్తము, మన ఆహారము, మన యొక్క మెదడు, మన యొక్క తెలివితేటలు యివన్ని కూడను తల్లి తండ్రుల యొక్క ప్రసాదములే. కనుక యీ పవిత్రమైన మానవ జన్మము అనుగ్రహించి ప్రసాదించిన యీ తల్లితండ్రులకు మనము యెంతయో ఋణపడి వుంటున్నాము. వారు బ్రతికి వుండినంత వరకు కూడను వారిని ప్రసన్నులను గావించి వారిని సంతృప్తి పరచే కర్మలు ఆచరించాలి. వారు మరణించిన తరువాత వారి జ్ఞాపకార్థమై యేర్పడినవే యీ శ్రార్ధములు. ఇట్టి శ్రార్ధ కర్మల చేతనే ఆ పితృదేవతలను సంతృప్తి పరచి వారిని సరైన ప్రసన్నులను గావించుకోవాలి. ఈ కారణ నిమిత్తమై కూడను పితృయజ్ఞము యేర్పడుతూ వచ్చింది.

భూత యజ్ఞము. మనము స్నానము చేయునప్పుడు, యిల్లు ఊడ్చునప్పుడు, బట్టలు వుతుకునప్పుడు యెన్నియో ప్రాణులు మరణించుచున్నవి. ఈ ప్రాణుల మరణించు యొక్క పరిహారార్థమై మనము యీ విధమైన భూతయజ్ఞము అనగా భూత ప్రీతికి మనము తగిన ప్రయత్నము చేయాలి. ఇది ప్రాచీన కాలమునుండి కూడను ఋషుల దగ్గరనుండి యిది ప్రారంభమైనది. ఋషుల ఆశ్రమములో సాత్విక స్వరూపులైన జింకలను, నెమళ్ళను పెంచుకొనటము, గోవులను పెంచుకొనటము యిది స్వార్థము, పరార్థము యొక్క నిమిత్తమై వారు ఆనందమును అనుభవించే నిమిత్తమై యీ భూత గణములను ప్రేమిస్తూ వచ్చారు. మన ప్రాచీన సంస్కృతిని పురస్కరించుకొని ఆనాటి వృద్ధులందరు కూడను యెక్కడైనా చీమలు పుట్టుచూస్తే అక్కడ చక్కెర వేయటమో లేక బియ్యపుపిండి పెట్టటమో యిలాంటి వంతా కూడను భూతప్రీతి నిమిత్తమై కర్మలాచరిస్తూ వచ్చారు. భుజించిన తరువాత మన యొక్క విస్తరియందు యేకొంత మెతుకులైనా వుంటుంటే దానిని బయట పారవేసినప్పుడు ఏ కాకులో, ఏ పక్షులో, ఏ కుక్కలో వచ్చి భుజించి అది కూడను భూత తృప్తిని కలిగించే మార్గాన్ని అవలంబింపు చేసుకున్నారు. ఈనాటికి కూడను అనేకమంది గృహములందు గోవులు, కుక్కలు, పక్షులు యిత్యాది చిన్న చిన్న మృగములంతా పెంచుకొని వాటిని తృప్తిపరుస్తూ వస్తున్నారు. ఈ భూతప్రీతిని కలిగించటము కారణమేమిటంటే మనము తెలియక చేసిన దోషముల పరిహారార్థము.

ఇంక మానవ యజ్ఞము. మనుష్యయజ్ఞమంటారు. మనము

పొయ్యి రగిలించే సమయమునందు, కూరగాయలు తరిగే సమయమందు, దారి నడచే సమయమందు అనేక ప్రాణులు నశిస్తూ వున్నాయి. కనుక యీవిధమైన యజ్ఞములు జరిపి, యీమరణించిన ప్రాణుల యొక్క పరిహార నిమిత్తము, పాప పరిహార నిమిత్తము గావించే కర్మలు యజ్ఞములుగా భావిస్తూ వచ్చారు ఆనాటి మహనీయులు.

కడపటిది ఋషియజ్ఞము. దీనినే బ్రహ్మయజ్ఞము అంటారు జంతూనాం నర జన్మ దుర్లభం. ఈ మానవ జన్మము చాలా దుర్లభమైనది. దుర్లభ మానవ జన్మకి. ఈ మనుష్య జన్మము చాలా దుర్లభమైనది. ఇది కేవలము జన్మాంతర సుకృతము చేతను, భగవత్ కృపా కటాక్షము చేతను యేర్పడినదే గాని మనుష్యప్రయత్నముతో లభించినది గాదు. ఈ లభించిన మానవ జన్మము సక్రమమైన మార్గములో వినియోగ పెట్టి, దీనిని సరైన మార్గమునందు ప్రవేశ పెట్టి తన గమ్యమును చేర్చే నిమిత్తమై ఆనాటి ఋషులు అనేక శాస్త్రములను, ఉపనిషత్తులను, యితిహాసములను, నియమములను, నిబంధనలను కూడను యేర్పరచి మానవునకు ఒక మార్గాన్ని చూపించారు. ఈ ధర్మార్థ కామ మోక్షములనే చతుర్విధ పురుషార్థములు కూడను వారే నియమించారు. మానవుని యొక్క నిత్యజీవితము సత్యమార్గములో ప్రవేశపెట్టే నిమిత్తమై యీ విధమైన ఆశయాలను వారు కల్పించారు. ఏ పశుపక్ష్యాది మృగములకు లేని నిబంధనలను మానవునకు నియమించారు. కారణమేమనగా మానవుడు విచక్షణా జ్ఞానము కలిగినవాడు కనుక నిత్యానిత్య విషయ పరిశీలనాశక్తి కలిగినవాడు కనుక యిలాంటి మార్గమును అవలంబించటము అత్యవసరము. ఈ పాపములు కూడను మానవునికే వున్నది గాని మిగిలిన పశుపక్షి మృగాదులకు లేవు మాత్రము కూడను లేవు. శాసనములు కూడను మానవులకే నియమించినారు కాని పశుపక్షి మృగాదులకు నియమించలేదు. శాస్త్రములు కూడను మానవుల నిమిత్తమై యేర్పడినవే గాని పశుపక్షి మృగాదుల నిమిత్తమై యేర్పడినవి కాదు. శాపములు కూడను మానవుల నిమిత్తమై యేర్పడినవే గాని పశుపక్షి మృగాదుల నిమిత్తమై ఏర్పడినవి కాదు. పాపము, శాస్త్రము, శాసనము, శాపము యీనాలుగు కూడను ఒక్క మానవునకు మాత్రమే. కనుక యిట్టి పవిత్రమైన రాజమార్గమున నడచి, మానవ జన్మము పవిత్రము గావించుకొమని మహర్షులు అనేక విధములైన మార్గములు నిరూపిస్తూ వచ్చారు. వారు యిచ్చిన యీ మార్గమునకు కృతజ్ఞతా పూర్వకముగా మనము వారిని చింతించి, వారిని స్మరించి, వారిని ధ్యానించి వారి ఆశయములను నెరవేర్చటమే మన ప్రధానమైన కర్తవ్యము.

307108606

దీనితోపాటు మానవుడు పంటను పండించే నిమిత్తము భూమిని దున్నుతున్నాడు. దుక్కి చేయుచున్నాడు. పంటలు పండిస్తున్నాడు. కలుపులు, కోతలు చేస్తున్నాడు. ఇట్టి పరిస్థితులలో అనేక విధములైన ప్రాణులు నశిస్తున్నాయి. ధాన్యము పండించే మార్గమందు అనేక ప్రాణులు పోవటం చేత యీ పాప పరిహార నిమిత్తము ఋషియజ్ఞము ఆచరించమని చెప్పారు. కనుక మానవుడు తను తెలియక యెన్నో ప్రాణులను నశింపచేస్తున్నాడు. ఈ జగత్తునందు అహింసా తత్వమును బోధించి, అహింసా తత్వము ఆచరించే వ్యక్తులు ఒక్కరు కూడను కనుపించటంలేదు. అహింసా తత్వము బోధించే అధికారము యెవ్వరికీ కూడను లేదు. ఇలాంటి మార్గములో మానవునికి తెలియకుండా యెన్నోవిధములైన ప్రాణులు హింసించబడుతున్నాయి. మనము నిత్యము అనుభవించే ఉఛ్వాస నిశ్వాసములందు కూడను అనేక క్రిమికీటకాదులు నశిస్తున్నాయి. మనము ఆచరించే ప్రాణాయామ ప్రత్యాహారములందు కూడను అనేక విధములైన క్రిమికీటకాదులు మరణిస్తున్నాయి. మనము ఆచరించే ధ్యాన తపస్సులందు అనేక క్రిమికీటకాదులు నశిస్తున్నాయి. ఇంక అహింస అనే దానికి ఎక్కడ స్థానమున్నది. క్షణాక్షణము కూడను మనము హింసలతోనే కూడివుంటున్నాము. హింసలనే చేస్తున్నాము. అయితే మనము తెలిసి చేయకూడదు పాపము. తెలిసి ఒకరిని హింసించకూడదు. తెలిసి ఒక ప్రాణిని బాధించకూడదు. తెలియక చేసే విషయాలెన్నో వుండవచ్చును. తెలియక చేసినవి పాపములు కాదు. ఇది పొరపాటు అని చెప్పవచ్చును. వీటిని క్షమించటానికి కూడను ఒక విధమైన అవకాశము వుంటున్నది. కాని తెలిసి చేసే పాపమునకు యేమాత్రము పరిహారము లేదు. ఇది తప్పక అనుభవించే తీరవలెను. కనుక మానవుని యొక్క కర్మాచరణయందు తాను చేసిన కర్మల ఫలితముగా అనేక విధములైన బాధలను అనుభవిస్తూ వుంటాము. ఎట్టి విత్తనమును మనము నాటుకుందుమో అట్టి మొక్కనే, అట్టి వృక్షముగానే, అట్టి ఫలములుగానే మనకు లభిస్తాయి. కేవలము మన యొక్క అభిమానముల చేతనే అనేక విధములైన కార్యములు సలిపినట్లుగా మనము భ్రమిస్తున్నాము. ఇది కేవలము అజ్ఞానమే.

ఇది చేతు అది చేతు ఇంకెన్నియో చేతు
ననుచు ఊహలు అల్లి అలసిపోకు
ఏ విత్తులను నాటి యుచ్చోట నుంటిరో
ఆ ఫలమ్ములె మీకు అందుచుండు
విత్తన మొకటైన వేరైన ఫలములు
సంభవించుట ఎట్లు సాధ్యమగును?

307108607

కనుకనే మనము త్రిమూర్తి ఆరాధన చేసి, మనము చేసిన త్రికాలముల యొక్క పాపములను కూడను పరిహారము గావించుకునే నిమిత్తమై ప్రాతఃసంధ్య మధ్యాహ్నసంధ్య, సాయంసంధ్య. ప్రాతః పూజ, మధ్యాహ్న పూజ, సాయంపూజ అనేవి యేర్పడుతూ వచ్చాయి. సూర్యుడు తెల్లవారి బ్రహ్మస్వరూపుడు, మధ్యాహ్నసమయమునందు యీ సూర్యుడు ఈశ్వరస్వరూపుడు. సాయంకాల సమయమునందు యీ సూర్యుడే విష్ణుస్వరూపుడు. కనుక త్రిసంధ్యలందు త్రిమూర్తుల యొక్క ఆరాధనగా జరిగిపోతున్నది. కాని యిట్టి సత్యాన్ని గుర్తించి వర్తించే వ్యక్తులు అరుదుగా వుంటుంటారు. మనము తెలియక అనేక కర్మలు ఆచరిస్తున్నాము కనుక యీ కర్మపరిహారము నిమిత్తమై యీ రకములైనవిదు యజ్ఞములు కూడను నిత్యము మనము గావించాలి. ఈ యజ్ఞములకు యీ విధముగా హోమగుండములుగానీ, యింకే విధములైన వేదికలుగాని మనము యేర్పరచుకో నక్కరలేదు. తల్లి తండ్రుల ఆజ్ఞను శిరసావహించి, దేవతలను చింతించి మన యింటియందున్న లేక బయట వుంటున్న, యేదైనా సమయము వచ్చినప్పుడు, ఆ ప్రాణాలకు కొంత ఆహారము నందించి లేక ఒక చిక్కగాడికైనా పట్టెడన్నము పెట్టి, కొన్ని కుక్కలకైనా యింత అన్నము పెట్టి దైవాన్ని చింతించి మన జన్మను పోషించుకోటానికి తగిన కృషి చేయటమే యీ ఐదు యజ్ఞముల యొక్క సారము. కనుకనే

అన్నదానము కంటె అధిక దానం బేది

తల్లి తండ్రుల కన్న దైవ మేది

జప తపంబుల కన్న సత్య శీలం బేది

దయ కంటె ఎక్కువ ధర్మమేది

సుజన సంగతి కన్న చూడ లాభం బేది

క్రోధంబు కన్న శత్రువ్వ మేది

ఋణము కంటెను నరులకు రోగమేది

ధరణి నపకీర్తి కంటెను మరణ మేది.

సర్వదా కీర్తి కంటెను సంపదేది

స్మరణ కంటెను మించు ఆభరణమేది!

కనుక మానవ జీవితమనేది చాలా వుత్కృష్టమైనది. శ్రేష్ఠమైనది. ఇట్టి శ్రేష్ఠమైన మానవ జీవితమును పవిత్ర మార్గములో ప్రవేశపెట్టుటయే మనయొక్క ప్రధాన కర్తవ్యము. కేవలము పైపై ఉచ్ఛారణల చేతను, పైపై మంత్రముల యొక్క

ప్రతిష్టల చేతను మనము యిట్టి పాపములను పరిహారము గావించుకొందమన్న యిది కేవలము వెఱ్ఱితనము. మంత్రముల చేత మన పాపము పరిహారము కాదు. కర్మల చేతనే యీ యొక్క పరిహారము యెంతవరకైనా జరుపుకోవచ్చు. కనుకనే కర్తవ్య కర్మలను నిర్వర్తించటానికి తగిన శక్తి సామర్థ్యములు మీరు సంపాదించుకోవాలి. నిత్యజీవితములో సత్యానందమును మనము అనుభవించాలి. కేవలము మనము యీనాడు అనుభవించే ఆనందము లౌకికానందము. క్షుద్రమైన ఆనందములు. క్షణికమైన ఆనందములు. అనిత్యమైన ఆనందములు. అసత్యమైన ఆనందములు. ఈ ఆనందముల చేత మన హృదయము యేమాత్రము కూడను పరిశుద్ధముగానేరదు. కనుకనే

చిత్తశుద్ధి లేని శివపూజ లేటికి
ఆత్మశుద్ధి లేని ఆచారమది యేల
పాత్రశుద్ధి లేని పాకమేల.

నీ హృదయము పరిశుద్ధముగా లేనప్పుడు, నీవు యెన్ని కర్మలు ఆచరించి ప్రయోజనమేమిటి? అసలు కర్మలు ఆచరించుటయే చిత్తశుద్ధి నిమిత్తము. మన కర్మల ద్వారా చిత్తము మరింత అశుద్ధము గావించుకోటము మరింత అజ్ఞానము.

కానీ యీనాడు అనేక విధములైన వేదాంతములు వుచ్చరించవచ్చు బోధించవచ్చు. కాని ఆచరించటము చాలా కష్టము. ఆ కష్టమైన ఆచరణనే మనము ప్రధానమైన లక్ష్యములో వుంచుకోవాలి. కష్టమునందే మనకు సుఖమున్నది గానీ, సుఖమునందు సుఖములేదు. కనుక మనము నిత్యజీవితములోపల యేవిధమైన వేదశాస్త్ర ఇతిహాస పురాణములు తెలియకపోయినా మనకు తెలిసినంతవరకును భూతదయ, పశ్చాత్తాపములు మన హృదయములో అభివృద్ధిపరచుకోవాలి. చేయకలిగిన శక్తివుండి కూడను దానధర్మము చేయలేని మూర్ఖత్వము యెన్ని మంత్రములు చేసినప్పటికి నిప్రయోజనము లేదు. శక్తివుండినంతవరకును మనము దానధర్మము చెయ్యాలి. ధనమునకు కూడను నలుగురు శత్రువులుంటున్నారు. మొట్టమొదటివాడు పెద్దకుమారుడు ధర్మము. ఈ ధర్మమునకే యీ ధనమును సద్వినియోగము గావించాలి. ఇంక రెండవవాడు రాజు అనగా ప్రభుత్వము. ఏదో ఒక సాకుపైన, ఏదో ఒక రైడ్ జరిపించో, యింకే విధమైన సుంకమని చెప్ప వారు గుంజుకోటానికి ప్రయత్నిస్తారు. వారు గుంజుకున్న తరువాత మిగిలిన దానిని యే దొంగలో ప్రవేశించి అపహరిస్తారు. ఇంకా మిగిలినది యేమైనా వుంటుంటే అగ్ని ప్రవేశించి భస్మము చేస్తుంది. కనుక జీవితమున్నంత లోపలనే మనము తగిన దానధర్మాలు చేసి జీవితాన్ని సార్థకము గావించుకోవాలి. తెలిసి చెయ్యాలిగానీ చచ్చిన తరువాత ఏమి

చేయటానికి వీలవుతుంది. చాలా మంది విల్లు రాస్తుంటారు ఫలాని ధర్మం అని. ఏమిటి చచ్చిన తరువాత అది కూడ చచ్చింది. నీవు బ్రతికి నప్పుడే నీ హస్తములతో చేసి నీ ఆనందమును అనుభవించు. ప్రతి ఒక్కటి కూడను మనము తెలిసి చెయ్యాలి. చూచి త్రొక్కు. తెలిసి మొక్కు. కనుకనే పరమభక్తుడైన త్యాగరాజు కూడను 'తెలిసి రామ చింతన చేయవే' నీవు తెలిసి భగవంతుని చింత చేయి మనసా. ఏదో తెలియకుండా అజ్ఞాన దృష్టితో నీవు స్మరించటానికి ప్రయత్నించవద్దు. అతడు సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమయుడు అనే విషయాన్ని గుర్తించుకొని ప్రయత్నించు అన్నాడు. కాని యీనాటి భక్తులు సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమయుడు అని చక్కగా వర్ణిస్తారు గాని పనులలో ప్రవేశపెట్టేటప్పటికి తుస్సు బుస్సు బయలుదేరుతుంటాయి. ఈ నాటి మన ప్రవర్తనలన్నియు కూడను పూజా రూముకు మాత్రమే ఒక హద్దుగా వుంటున్నాయి. ఈ పూజ రూములో వుండినంత వరకు మాత్రము పరమ శాంతిగా వుంటారు. భగవంతుని చాలా ప్రార్థిస్తూ వుంటారు. ఆ గడప దాటి యివతలకు అడుగు పెట్టెనా యింక పనివారిపైన, వీరిపైన వారిపైన అనేక రకములైన ఉద్రేకములు బయలుదేరుతుంటాయి. ఇది కాదు మన నిజమైన యోగము. ఇది కాదు మన నిజమైన ధ్యానము. ఇది కాదు మన నిజమైన భక్తి. సతతం యోగినః. నిరంతరము శాంతితో ప్రేమతో సత్యముతో జీవితాన్ని అంకితము గావించాలి.

భగవంతుని ముందు అనేక భరత నాట్యాలాడుతూ వుంటారు. ఈ వినయ విధేయతలు కేవలము ఆషాఢ భూతుని వేషాలుగా కన్పిస్తుంటాయి. కొంచెం మోరుగు పోయినా యింక సాక్షాత్తు దూర్వాసులో, వశిష్ఠులో, అంబరీషులో యింకేవిధమైన మార్గములో అవలంబిస్తూ వుంటారు. ఈ విధముగా మారటమనేది యేమాత్రము కూడను మంచిది కాదు. సమయమును పురస్కరించుకొని కొన్ని పదములు మార్చుకొనవచ్చును. కాని హృదయాన్ని మాత్రం మార్చుకోరాదు. ఇలాంటివారి హృదయం కేవలము ఒక రాక్షస హృదయమనే చెప్పవచ్చును. కనుక మనము చూచుటకు మానవుల వలె వుంటుండి మన ప్రవర్తన రాక్షస ప్రవర్తనగా వుంటూ వుంటే యింక దైవత్వము ఏ రీతిగా మనకు ప్రాప్తిస్తుంది. ఈనాడు ప్రపంచములో మానవత్వమనేది యెక్కడా కూడను కన్పించటము లేదు. అనేక మంది సాధకులంతా కూడను భగవంతుని అన్వేషిస్తున్నాము, భగవంతుని వెదుకుతున్నాము అని అంటున్నారు. సర్వత్రా వున్న భగవంతుని వెతకటము ఎందుకు. ఎక్కడ వెదకటం? తాను భక్తుడు కాదు కనుకనే వెతుకుతున్నాడు. నిజమైన భక్తుడైతే వెతుక నక్కరలేదు. సర్వత్రా తానే వుంటున్నాడు. ఈ నాడు భగవంతుని భక్తుడు వెతకటంలేదు. భక్తులను భగవంతుడు వెతుకుతున్నాడు. ఎక్కడ సరైన భక్తుడున్నాడా అని

వెతుకు తున్నాడు. ఈ వెతకటం ఎందుకంటె ఎక్కడ చూచినా సరైన భక్తుడు లేడు కనుకనే వెతుకు తున్నాడు. ఈ నాటి మన భక్తి అంతా అవర్స్ భక్తుడు భగవంతుని వెతకటము పోయి భగవంతుడే భక్తులను వెతుకుతున్నాడీ నాడు. కనుక మనము భగవంతుడు మనలను వెతక నివ్వకుండా మనమే భగవంతుని దక్కించుకొని, చిక్కించుకొనే వుపాయాన్ని మనం సాధించాలి.

కర్మాచరణద్వారా కాయమును సార్థకము చేసుకొని, కాలమును పవిత్రము గావించుకొని, దివ్యత్వాన్ని అనుభవించి, పవిత్రతలో మనము లీనమైపోవాలి. మన హృదయము ఒక్కటే. ఇది ఒక మ్యూజికల్ ఛైర్ కాదు. ఒకతూరి ఒక్కరు, మరొకతూరి మరొకరు, మరొకతూరి మరొకరిని యీ హృదయములో చేర్చుకోటానికి ప్రయత్నించకూడదు. నిజమైన భక్తునికి వుండవలసిన లక్షణాన్ని మనము గుర్తించుకోటానికి ప్రయత్నించాలి. కష్టములకు, నష్టములకు, దుఃఖములకు, విచారములకు, నిందలకు, నిష్ఠూరములకు అన్ని కాలములందు కూడను ఒకే సమత్వాన్ని మనము వహించాలి. పదిమంది పొగిడితే మనము ఏభై పౌండ్లు వుండే వాళ్లము నూరు పౌండ్లుగా పెరిగి పోతాము. ఎవ్వరైనా దూషిస్తే లేక విమర్శిస్తే మనము కృంగి పోతాము. ఈ కృంగి పొంగనటువంటి భక్తి మనము సాధించాలి. కృంగటము ఒక బలహీనత. పొంగిపోవటం ఒక అహంకారత. ఈ రెండింటికి మనము స్థానము యివ్వకూడదు.

పట్టిన దేదియో పట్టునే పట్టితివి
పట్టునెగ్గెడు దాక పట్టియుండు
కోరిన దేదియో కోరనే కోరితివి
కోర్కె చెల్లెడు దాక కాలిచియుండు
అడిగిన దేదియో అడగనే అడిగితివి
అడిగిన దిడు దాక విడువకుండు
తలచిన దేదియో తలచనే తలచితివి
తలపు తీరెడు దాక తరలకుండు
పోరు పడలేక తానైన బ్రోవవలయు
ఒడలు తెలియక నోపైన అడుగవలయు
అంతియుకాని మధ్యలో ఆపివేసి
తిరిగి పోవుటు భక్తుని దీక్ష కాదు.

అన్నారు. ఇవి భక్తుని యొక్క లక్షణాలు. ఇట్టి లక్షణాలను మనము అభివృద్ధిపరచుకొని

307108611

మనయందు చేరిన అవలక్షణములు దూరము చేసి యీ నిత్యానందమును, యీ బ్రహ్మానందమును, ఆత్మానందమును అనుభవించి దేశమునందు తగిన ఆదర్శమును అందించాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నాప్రసంగాన్ని విరమిస్తున్నాను.